క్లుప్తంగా

పరిశుభ్రతపై అవగాహన



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ నాగేందర్

చేర్యాల(సిద్దిపేట): వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగేందర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని బీడీ కాలనీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆడెపు నరేందర్‌తో కలిసి ఆయన పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు. కాలనీలో నీటి నిల్వలు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు అధికారి బావనా ఋషి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్‌తో విజ్ఞానం



మాట్లాడుతున్న ఎస్ఐ విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): ఓపెన్ హౌస్ లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌లో విధివిధానాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు, సామాజిక బాధ్యతపై గురించి తెలుసుకోవాలన్నారు.

వర్షాల కోసం కప్పతల్లి ఆటలు



గ్రామస్తుల కప్పతల్లి ఆటలు

హుస్నాబాద్: గ్రామాల్లో వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు మొదలయ్యాయి. మండలంలోని చెంచెల్ చెరువుపల్లిలో వర్షాలు పడక, నాటిన విత్తనాలు మొలవక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు వర్షాలు పడాలని కప్పతల్లి ఆటలు ఆడి అనంతరం గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఇలా చేయడం వల్ల వరుణుడు కరుణించి వర్షాలు కురిపిస్తాడని గ్రామస్తుల నమ్మకం

బనకచర్ల ప్రాజెక్టుతో అన్యాయం: బీఆర్‌ఎస్ నేతలు



సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరిపై నిర్మించాలని చూస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆ ప్రాజెక్టును అడ్డుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. చిన్నకోడూరులో గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ సర్పంచ్‌లు ఉమేశ్‌చంద్ర, ఎల్లయ్య, రమేశ్, కుంటయ్య, వేణు మాట్లాడారు. బనకచర్లను అడ్డుకోలేక బీఆర్‌ఎస్‌పై నేపం నెట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. పాలన చేతగాక కేసీఆర్, హరీశ్‌రావుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా స్పోర్ట్స్ డే



యూనిఫారం అందిస్తున్న ఎంఈఓ ప్రభుదాసు

దుబ్బాక: ధర్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఘనంగా స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాసు, హెచ్‌ఎం సాదత్ అలీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణమాచారి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకానికే పరిమితం!

గ్రామానికి గ్రామానికి సంబంధం కలిపేవి వారధులు. వర్షాకాలం కొన్ని గ్రామాల మధ్య ఉండే వాగులపై ఉండే లో లెవల్ వంతెనలు కష్టాలు తెచ్చిపెడతాయి. వరద నీటి ఉధృతి గ్రామాల మధ్య రాకపోకలు స్తంభింపజేస్తాయి. దానికి పరిష్కారం హైలెవల్ వంతెనల నిర్మాణాలు. చాలా చోట్ల ఆ వంతెనల నిర్మాణ పనులు శిలాఫలకాలకే పరిమితమవుతున్నాయి.

వంతెన నిర్మాణానికి గ్రహణం

- రెండేళ్లు కావస్తున్నా ప్రారంభంకాని పనులు
- వర్షాలు కురిస్తే ప్రజలకు తప్పని తిప్పలు
- స్పందించే నాథుడు కరువు



రామునిపట్ల- గోనెపల్లి గ్రామాల మధ్య లో లెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వాగు(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల – గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై ఉన్న లోలెవల్ వంతెనతో ప్రతి యేటా వర్షాకాలంలో వరద ఉధృతి కారణంగా రెండు గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్నో యేళ్లుగా ప్రజలు ఈ సమస్య పరిష్కారానికి ఎదురుచూస్తున్నారు. ఈ వంతెన స్థానంలో హై లెవల్ వంతెనతోపాటు గోనెపల్లి గ్రామం వరకు మూడు కిలోమీటర్లు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.14.45 కోట్లు మంజూరు చేయగా, 2023 అక్టోబర్‌లో అప్పటి మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు.

తప్పని తిప్పలు

అయితే ఇప్పటి వరకు హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో రెండు గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వానాకాలంలో రామునిపట్ల–గోనెపల్లి గ్రామాల మధ్య వాగు ఉధృతి కారణంగా రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో ఆ గ్రామాల రైతులు వ్యవసాయ పనులకు వెళ్లలేక నష్టపోతున్న పరిస్థితి.

స్పందించని అధికారులు

ఎన్నోయేళ్లుగా స్థానికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



హై లెవల్ వంతెన నిర్మాణ పనుల కోసం వేసిన శిలాఫలకం

ఇబ్బందులు తీర్చండి సారూ..



గోనెపల్లి– రామునిపట్ల గ్రామాల మధ్య వాగుపై ఉన్న లోలెవల్ వంతెన స్థానంలో హై లెవల్ వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేసి రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు తీర్చాలి. వర్షాలు కురిస్తే వాగు పారితే రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వెంటనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలి.

– ఆకుల శివకుమార్, రామునిపట్ల

అపరిచితుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తం

- ఏసీపీ సదానందం
- కోహెడలో కార్డన్ అండ్ సెర్చ్



కోహెడలో మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

హుస్నాబాద్: అపరిచితుల ఫోన్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పిలుపునిచ్చారు. ప్రజలకు భద్రత కల్పించడంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, గుర్తు తెలియని ఫోన్ నంబర్ల నుంచి లింక్‌లు వస్తే ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్ చేయాలని చెప్పారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, మహిళలు రక్షణ కోసం ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాలలో మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అభిలాష్‌ను అభినందించారు. సరైన పత్రాలులేని 47 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట ఎస్ఐలు అభిలాష్, మహేశ్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

నంగునూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం ఈనెల 26 నుంచి 29 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 24 నుంచి ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఆధార్, ఎస్ఎస్సీ సర్టిఫికెట్, బోనఫైడ్, టీసీ, ఆదాయ, కుల ధ్రువీకరణ తదితర పత్రాలతో రావాలని కోరారు.

ఓపెన్ స్కూళ్లలో ప్రవేశాలు

మద్దూరు(హుస్నాబాద్): ఓపెన్ స్కూళ్లలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాలల కోఆర్డినేటర్లు వరదరాజు తెలిపారు. గురువారం ఆయన రేబర్తి ఉన్నత పాఠశాలల్లో మాట్లాడుతూ జూలై 13 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్లు తీసుకుంటామని ఆగస్టు 12వరకు అపరాధ రుసుంతో తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9948250886, 9573101312 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రజలకు మరింత నమ్మకం కలిగిద్దాం



ప్రార్థన గీతాన్ని ఆలపిస్తున్న ఎంఈఓ సత్తయ్య

మండల విద్యాధికారి సత్తయ్య

కొండపాక(గజ్వేల్): గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతున్న తరుణంలో మరింత నమ్మకం కలిగేలా సమష్టిగా కృషిచేద్దామని ఎంఈఓ బచ్చలి సత్తయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కుకునూరుపల్లిలోని ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బడిబాట కార్యక్రమ నిర్వహణలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి చాకచక్యంగా వ్యవహరించారని ప్రశంసించారు. ఎన్నడూ లేని విధంగా ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే 50 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించడం గొప్ప విషయమన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ మరింత మంది విద్యార్థులు చేరేలా కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పనితీరును అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సంతోష్, ఉపాధ్యాయులు రాంచంద్రం, స్వరూపరాణి, శంకరయ్య, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేట: ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి రూ.18 వేలు వేతనం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన గురువారం ఆశా వర్కర్ల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఆశా వర్కర్లకు అన్యాయం చేస్తోందన్నారు. వారికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకపోగా పనిభారం పెంచి శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గ హక్కుల సాధనకై జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను ఆశా వర్కర్లు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కోశాధికారి భాస్కర్, సహాయ కార్యదర్శి రవికుమార్, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, నీరజ, కవిత, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

డ్యూయెల్ డెస్కుల పరిశీలన

మిరుదొడ్డి(దుబ్బాక): మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంజూరైన ఐదు కంప్యూటర్లు, డ్యూయెల్ డెస్కులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయుడు దయాసాగర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం

ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, స్పీడ్ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నియమాల అమలును బలోపేతం చేయాలని కోరారు. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాద వివరాలను సేకరించి చర్యలు చేపట్టాలని సూచించారు.

‘భూ భారతి’తో బాధితులకు మేలు

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



బాధితుడితో మాట్లాడుతున్న అబ్దుల్ హమీద్

బెజ్జంకి(సిద్దిపేట)/కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని గాగిళ్లాపూర్‌లో నిర్వహించిన భూ భారతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ గురువారం పరిశీలించారు. బాధితుల నుంచి వచ్చిన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ సదస్సులతో బాధితులకు మేలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ గోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కోహెడ రూరల్ మండలంలోని వింజపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును హమీద్ సందర్శించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయన వెంట డీటీ దేవేంద్ర, ఆర్ఐ ఎల్లయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మర్కూక్(గజ్వేల్): గ్రామాలలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సన్నపేట గ్రామంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా 1,200 దరఖాస్తులు స్వీకరించామని ఆయన తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఆర్ఐ శ్రీధర్, నాయకులు దినేశ్, నవీన్, భాను, కృష్ణ, భిక్షపతి, విజయ్, రైతులు పాల్గొన్నారు.

నమోదు చేసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: రైతులు తమ భూ సమస్యలను భూ భారతి సదస్సులో నమోదు చేసుకోవాలని నాయబ్ తహసీల్దార్ రుక్మిణిరెడ్డి కోరారు. వంగరామయ్యపల్లి, తోటపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అర్జీలు పెట్టిన రైతుల భూ రికార్డులను ఆమె పరిశీలించారు. సాదా బైనామా, వారసత్వ భూముల సమస్యలు ఎక్కువ వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాజు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రుణం తీర్చుకునేందుకే..

- అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్
- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ



విలేకరులతో మాట్లాడుతున్న శర్మ

సిద్దిపేటజోన్: తన గురువు చంద్రబాబు రుణం తీర్చుకునేందుకు శిష్యుడు రేవంత్‌రెడ్డి తాపత్రయపడుతున్నారని, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కల్పిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరామ్ ఆరోపించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే రేవంత్‌రెడ్డి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారని ఎద్దేవా చేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ వ్యాఖ్యలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అబద్ధాలకు సీఎం రేవంత్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ నాయకులు మాణిక్యరెడ్డి, మోహన్‌లాల్, సోమిరెడ్డి కనకరాజు, సాయి ప్రేమ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలి

ఎస్ఐ అపూర్వరెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేటరూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని ఎస్ఐ అపూర్వరెడ్డి పిలుపునిచ్చారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో గురువారం ఆమె స్థానికులతో మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని యువకులను కోరారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరూ బెల్ట్ షాపులు నడపవద్దని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, వీపీఓ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో జీవశాస్త్రం, వృక్షశాస్త్రం బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు 23లోగా దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ అందె గణేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో బాటనీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 95422 26129లో సంప్రదించాలని సూచించారు.



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

దేశానికి దిక్సూచి రాహుల్ గాంధీ

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకులు కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ దేశంలో పాలకులు కుల, మతాలను రెచ్చగొట్టి విద్వేషాలు పెంచుతున్న సమయంలో భారత్‌జోడో యాత్రతో రాహుల్ గాంధీ దేశానికి ఒక దిక్సూచిగా మారారని ప్రశంసించారు. ఆయన నాయకత్వం ఎంతో అవసరమన్నారు. ఆస్పత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో కాంగ్రెస్ నేతల అన్నదానం



హుస్నాబాద్: అంబేడ్కర్ చౌరస్తావద్ద కేక్ కట్‌చేస్తున్న లింగమూర్తి తదితరులు



కొమురవెల్లి(సిద్దిపేట): పట్టణంలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నర్సారెడ్డి తదితరులు



చేర్యాల(సిద్దిపేట): కేక్ కట్ చేస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆగంరెడ్డి తదితరులు



దుబ్బాకటౌన్: దుబ్బాకలో..